# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు చేరేలా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులను తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి జిల్లాలో ఒక కారాగారం ఏర్పాటు దిశగా ప్రణాళిక రూపొందించాలని హోం మంత్రి వి.అనిత అధికారులను ఆదేశించారు.**

3. **సూర్యలంక బీచ్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

4. **తెలంగాణలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ పాలిసెట్-2026 పరీక్ష ఈరోజు జరగనుంది.**

==========================

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులను తీసుకువస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు ఉద్యాన పంటల వైపు ప్రోత్సహించాలని సూచించారు.పరిపాలనలో ఆధునిక సాంకేతికత వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని, డేటా ఆధారిత నిర్ణయాలతో వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరి పీచు, నారు, ఇతర అనుబంధ పరిశ్రమల అభివృద్ధిపై చర్చించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి సాగు అధికంగా ఉన్న నేపథ్యంలో అక్కడ కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉత్పత్తుల నాణ్యత పెంచి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు ప్రోత్సహించాలన్నారు. రైతులకు అదనపు

ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి జిల్లాలో ఒక కారాగారం ఏర్పాటు దిశగా ప్రణాళిక రూపొందించాలని హోం మంత్రి వి.అనిత అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జైలు శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని జైళ్ల పరిస్థితి, ఖైదీల రద్దీ, భద్రతా చర్యలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపయోగంలో లేని జైళ్లను మరమ్మతులు చేసి ఇతర కార్యకలాపాలకు వినియోగించే అవకాశాలపై నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం, విశాఖపట్నం జైళ్లలో అధిక రద్దీ ఉన్న నేపథ్యంలో కొన్ని జైళ్లను పునరుద్ధరించి ఖైదీలను అక్కడికి తరలించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఖైదీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మానసిక ఆరోగ్య సహాయం అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని సూర్యలంక బీచ్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌లో పలు అభివృద్ధి పనులకు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి నిన్న భూమి పూజ చేశారు. పర్యాటకులను ఆకర్షించేలా అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్, జెట్ స్కీ రైడ్స్‌ను కూడా ప్రారంభించారు. సూర్యలంక బీచ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ కోసం కృషి చేస్తున్నామని మంత్రి ఈసందర్భంగా తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

తెలంగాణాలోని హైదరాబాద్ నుంచి ఔషధాలను ఎగుమతి చేసేందుకు 'ఔషధి ఎక్స్‌ప్రెస్' పేరుతో దేశంలోనే తొలి ఫార్మా ప్రత్యేక రైలును భారతీయ రైల్వే ప్రారంభించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక రైలు హైదరాబాద్ నుంచి ముంబై పోర్టుకు తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిందని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటి వరకు రోడ్డు మార్గంలో రవాణాకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు ఉష్ణోగ్రత మార్పుల వల్ల ఔషధాలు దెబ్బతినే ప్రమాదం ఉండేదని 'ఔషధి ఎక్స్‌ప్రెస్' ఆ సమస్యలకు పరిష్కారంగా నిలవనుందని తెలిపారు. పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టును భవిష్యత్తులో దేశంలోని ఇతర ఫార్మా కేంద్రాలకు కూడా ఈ తరహా రైళ్లను

విస్తరించే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని  కిషన్ రెడ్డి వెల్లడించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంతకల్లు–మార్కాపురం మధ్య నూతన రైలును నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి నంద్యాల రైల్వే స్టేషన్‌లో  జెండా ఊపి నిన్న  ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో కలిసి రైలు సేవలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ,  కొత్త రైలు ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని రైళ్ళను తీసుకురావడానికి కృషి చేస్తామని బైరెడ్డి శబరి తెలియజేస్తూ,

వాయిస్..25..  సెకన్లు

-----------------------------

తెలంగాణలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ పాలిసెట్–2026 పరీక్ష ఈ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాల వరకు జరగనుంది. పరీక్షకు మొత్తం లక్షా 6 వేల 439 మంది దరఖాస్తు చేసుకోగా... తెలంగాణా వ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష ప్రారంభ సమయానికి గంట ముందు నుంచే లోపలికి అనుమతిస్తారని,  ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలో ప్రవేశానికి అనుమతి ఉండదని తెలిపారు.  విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న  48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని, ఉత్తర తమిళనాడు, రాయలసీమ, కర్ణాటక మీదుగా మరాఠ్వాడా వరకు ద్రోణి విస్తరించినట్లు తెలిపింది. ద్రోణి ప్రభావంతో అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు పోలవరం ప్రాంతంలో ఈరోజు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

=====================